

మాట్లాడుతున్న బెల్లంపల్లి నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, చిత్రంలో ఎన్నికల ఇన్‌చార్జి, పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేతకాని

# ప్రగతి పథంలో తెలంగాణ

- ప్రజల సమస్యలు తీరుస్తున్న సీఎం
- చేసిన అభివృద్ధి, సంక్షేమం, చేసే పనులను ప్రజలకు వివరించాలి
- బెల్లంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేతకాని
- తాండూర్‌లో బూత్ కమిటీ సభ్యుల సమావేశం

తాండూర్, నవంబర్ 3 : సీఎం కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజల సమస్యలను తీర్చి, రాష్ర్టాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారని బెల్లంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, ఎన్నికల ఇన్‌చార్జి, పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేతకాని స్పష్టం చేశారు. తాండూర్‌లోని మినీ సురభి గార్డెన్స్‌లో శుక్రవారం వెంకటేశ్ నేతకాని అధ్యక్షత బీఆర్ఎస్ మండల బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సీఎం కేసీఆర్ నమ్మకంతో బెల్లంపల్లి టికెట్ ఇచ్చారని, అందరూ ఐక్యతతో పని చేసి గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదిన్నరేండ్ల కాలంలో చేసిన అభివృద్ధి, సకాలంలో అందుతున్న సంక్షేమ పథకాలు, తిరిగి అధికారంలోకి వస్తే ప్రజల కోసం ఏం చేస్తుందనేది విస్తృత స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని వారు సూచించారు. ప్రతీ బూత్ సభ్యుడికి వంద మంది ఓటర్లు.. అంటే కేవలం 25 ఇండ్లకు పోయి ప్రచారం చేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో బీఆర్ఎస్‌ను భారీ మెజారిటీతో గెలుపించుకునేందుకు కార్యకర్తలు, బూత్ లెవల్ సభ్యులంతా పని చేయాలని పిలుపునిచ్చారు. ఇదే కార్యక్రమంలో మండలంలోని నీలాయిపల్లి, కిష్టంపేట గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు, యువకులు సుమారు 100 మంది బీఆర్ఎస్‌లో చేరారు. కాగా, వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పూసాల ప్రణయ్‌కుమార్, జడ్పీటీసీ సాలిగామ బానయ్య, బుగ్గ దేవస్థానం చైర్‌పర్సన్ మాసాడి శ్రీదేవి, పార్టీ అధ్యక్షుడు సుబ్బ దత్తుమూర్తి, రైతు బంధు సమితి కన్వీనర్ దత్తాత్రేయరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గట్టు సంతోష్‌కుమార్, సీనియర్ నాయకులు ఎస్ మహేందర్‌రావు, పురుషోత్తంగౌడ్, ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, బూత్ కమిటీల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు, గ్రామస్తులతో ఆసిఫాబాద్ నియోజకవర్గ అభ్యర్థి కోవ లక్ష్మి

## వ్యవసాయాన్ని పండుగ చేసింది
# ముఖ్యమంత్రి కేసీఆరే

- రైతులంతా సంతోషంగా ఉన్నరు
- బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి
- ఆసిఫాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి, జడ్పీ చైర్ పర్సన్ కోవ లక్ష్మి
- పార్టీలో 200 మంది చేరిక

ఆసిఫాబాద్, నవంబర్ 3 : వ్యవసాయాన్ని పండుగ చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని, ఆయన హయాంలో రైతులంతా సంతోషంగా ఉన్నారని ఆసిఫాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, జడ్పీ చైర్ పర్సన్ కోవ లక్ష్మి అన్నారు. మండలంలోని బూరుగూడకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులతో పాటు 200 మంది గ్రామస్తులు కోవ లక్ష్మి సమక్షంలో గురువారం రాత్రి ఎంపీపీ మల్లికార్జున్ యాదవ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కోవ లక్ష్మి, అరిగెల నాగేశ్వర్‌రావు వారికి గులాబీ కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి మాట్లాడుతూ రైతు బంధు, రైతు బీమా, కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, ఆసరా పింఛన్లతో ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నింపుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి మరోసారి అవకాశం కల్పించాలని కోరారు. కారు గుర్తుకు ఓటు వేసి, తనను ఆసిఫాబాద్ ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ హైమద్, సర్పంచులు శ్రీనివాస్, భీమేశ్, నాయకులు ప్రసాద్, శ్రీనివాస్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# అన్ని వర్గాలనూ ఆదుకున్నం

- భారీ మెజార్టీతో గెలిపించండి
- చెన్నూర్ నియోజకవర్గ అభ్యర్థి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్
- భీమారంలో ఇంటింటా ప్రచారం



ప్రచారంలో చెన్నూర్ నియోజకవర్గ అభ్యర్థి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్

భీమారం, నవంబర్ 3 : అన్ని వర్గాలనూ తెలంగాణ సర్కారు ఆదుకున్నదని, బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి భారీ మేజార్టీతో గెలిపించాలని చెన్నూర్ నియోజకవర్గ అభ్యర్థి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ప్రజలను కోరారు. భీమారం మండల కేంద్రం ముదిరాజ్ కాలనీలోని లక్ష్మీ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ కాలనీ, ఎస్సీ కాలనీ, ఎస్టీ కాలనీ, ముదిరాజ్ కాలనీల్లో ఇంటింటా ప్రచారం చేశారు. కేసీఆర్ మ్యానిఫెస్టోను వివరించారు. అంబేద్కర్, ముదిరాజ్ కాలనీల్లో సుమన్‌కు మహిళలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. ప్రతి ఒక్కరూ బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గద్దె రాంరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కలగూర రాజ్ కుమార్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు చెఋకు సరోత్తమరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ భూక్యా రాజ్ కుమార్ నాయక్, బీఆర్ఎస్ నాయకులు వేముల శ్రీకాంత్ గౌడ్, వేముల ప్రణీత్ గౌడ్, వీరాగోణి రమేశ్ గౌడ్, ఆత్కూరి రాము, జనంపల్లి సమ్మయ్య, దాసరి మధునయ్య, చింతం తిరుపతి, సుంకరి భూమేశ్, రాజ్ నాయక్, రాజేశ్ నాయక్, కట్ట నాగరాజు, మాజీ జడ్పీటీసీ జర్పుల రాజ్ కుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ నాయకులకు నగదు అందజేస్తున్న వృద్ధురాలు సమ్మక్క

## ఎన్నికల ఖర్చుల కోసం సుమన్‌కు నెల పింఛన్ అందించిన వృద్ధురాలు

చెన్నూర్, నవంబర్ 3 : బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, విప్ బాల్క సుమన్ ఎన్నికల ఖర్చు కోసం చెన్నూర్ పట్టణానికి చెందిన వృద్ధురాలు సమ్మక్క తన నెల పింఛన్ రూ.2,016ను అందజేశారు. 11వ వార్డులో శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. అక్కడకు వెళ్లిన నాయకులకు సమ్మక్క నెల నెలా తనకు సీఎం కేసీఆర్ అందజేసే పింఛన్ నుంచి రూ.2,016ను అందజేశారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చి, కేసీఆర్ మూడోసారి సీఎం అవుతారని వృద్ధురాలు ఆశాభావం వ్యక్తం చేశారు.

# చిరకాల స్వప్నం నెరవేర్చింది కేసీఆర్

- మంచిర్యాల నియోజకవర్గ అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే
- ప్రచారంలో అభ్యర్థి, ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు



ఎన్నికల ప్రమోషన్ వీడియో చిత్రీకరణలో భాగంగా కార్యకర్తలతో కలిసి నృత్యంచేస్తున్న మంచిర్యాల ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాల టౌన్, నవంబర్ 3 : మంచిర్యాలను కొత్త జిల్లాగా ఏర్పాటు చేసి ప్రజల చిరకాల స్వప్నం నెరవేర్చింది సీఎం కేసీఆరేనని, నియోజకవర్గ అభివృద్ధి చేసింది బీఆర్ఎస్సేనని పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు స్పష్టం చేశారు. మంచిర్యాల పట్టణంలోని 31వ వార్డు గోసేవా మండలి ప్రాంతంలో శుక్రవారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో అభివృద్ధి విషయంలో ఏం జరిగిందని ప్రతిపక్షాలు అంటున్నాయని, వాళ్లంతా ఒకసారి కళ్లు తెరిచి చూడాలని, ఒకప్పటి మంచిర్యాల, ఇప్పటి మంచిర్యాలకు తేడా సరిపోల్చుకోవాలని సూచించారు. ప్రశాత వాతావరణంలో ఉన్నామని ప్రజలంతా అనుకుంటున్నారని, మంచి మంచిర్యాలగా నిలిపేందుకు ఎళ్లవేళలా పాటుపడుతున్నానని పేర్కొన్నారు. నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ గులాబీ జెండా ఎగురవేసేందుకు అన్ని వర్గాల ప్రజల మద్దతు కోరుతున్నానన్నారు. పెద్ద ఎత్తున ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు సాగుతున్నాయని, వీటిని చూసి ఓటువేయాలని ప్రజలను కోరారు. ఈ ప్రభుత్వం వల్ల ప్రతీ కుటుంబానికి మేలు జరుగుతుందని చెప్పారు. కోల్‌బెల్ట్‌లో పట్టాల పంపిణీ, కారుణ్య నియామకాలు, హాజీపూర్ మండలంలో 10 వేల ఎకరాలకు సాగునీరు, నియోజకవర్గం వ్యాప్తంగా రోడ్ల విస్తరణ, అండర్‌గ్రౌండ్ రైల్వే బ్రిడ్జి నిర్మాణం, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల నిర్మాణాలు, రైతుబంధు, దళితబంధు, ఆసరా పింఛన్లు, షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి, కుల సంఘాలకు ఆర్థిక సాయం, కేసీఆర్ కిట్ల పంపిణీ, తదితర పథకాలు ప్రజల దరి చేరాయని, వీటితో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని వివరించారు. కాంగ్రెస్ పాలిత రాష్ర్టాల్లో ఇలాంటి పథకాలు లేవని, కరెంటు ఇచ్చే పరిస్థితి కూడా లేదని విమర్శించారు. ఇక్కడ కాంగ్రెస్ తరపున పోటీ చేస్తున్న ప్రేంసాగర్‌రావు బ్యాంకులకు రూ.800 కోట్లు అప్పుగా ఉన్నాడని, రాజకీయాల్లోకి వస్తే ప్రజలకు ఏం సేవ చేస్తాడో అందరూ ఆలోచించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, ఎమ్మెల్యే తనయుడు విజిత్‌రావు, మున్సిపల్ కౌన్సిలర్లు సురేశ్‌బల్దవా, మాదంశెట్టి సత్యనారాయణ, అంకం నరేశ్, పోరెడ్డి రాజు, బీఆర్ఎస్ నాయకులు పల్లపు తిరుపతి, బొట్ల సత్యానారాయణ, గొంగళ్ల శంకర్, రవీందర్‌రావు, శ్రీపతి వాసు, ముఖేశ్, తాజుద్దీన్, రాజ్‌కుమార్, సుధీర్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.



గోసేవా మండలి ఏరియాలో ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు, చైర్మన్ రాజయ్య